# నేనూ నీతోనే సులో!



వి.ఎం.ఎస్. స్వాతి

మినీకథ

సురేష్, ప్రణీత ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఒకటి కానిదే జీవించలేమనుకున్నారు. వారి నిర్ణయం విన్న జగదీష్— 'నో! ఈ పెళ్ళికి ఛస్తే నేను ఒప్పుకోను' అని నిక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు..

అతను— సురేష్ తండ్రి.

తను వీల్లేదు అన్నంత మాత్రాన కొడుకు తలొంచుకోలేదు. 'నాన్నా! మా పెళ్ళికి నువ్వు ఒప్పుకోని పక్షంలో ఇల్లు వదిలి వెళ్ళయినా ప్రణీతను నా దాన్నిగా చేసుకొంటాను...' తలెగరేస్తున్న అతన్ని కొట్టడానికి పసివాడేం కాదు. మంచి చెడ్డలు తెలియనంత అర్భకుడా అంటే ఎం.కాం చేసి బ్యాంక్‌లో ఉన్నతోద్యోగంలో ఉన్నాడు.

'డ్యామిట్ లవ్! డ్యామిట్ సెంటిమెంట్!' కొడుకు నేం చేయలేని స్థితిలో తనలో తానే సణుక్కున్న జగదీష్‌కు— రోజూ సాయంత్రం వేళల్లో ఇంటి వెనుక నున్న విశాలమైన గ్రౌండ్‌లో క్రికెట్ ఆడే అలవాటుంది.

కొడుకు తన మాట మన్నించి ఉంటే కట్నం రూపేణా లక్షలాస్తి, సంప్రదాయం కలిగిన కోడల్ని కొన్నందుకు ఇంటా— బయటా మెచ్చుకోలు. ఆశలు, అంచనాలు తారుమారయ్యాయన్న ఉక్రోషం కొద్దీ ఆ వేళ క్రికెట్ ఆడుతూ, కసికొద్దీ బ్యాట్‌తో తంతూన్న బాల్‌ను కొడుకు ప్రేమిస్తూన్న ప్రణీతగానే భావించుకు శాడిస్టిక్ గాఫీలయ్యాడు.

"రోజులు మారాయి!"

ప్రేమ విషయాల్లో పిల్లలు, కన్నవారి మాటను మన్నించేందుకు ఎక్కడైనా ఎదురు పవనాలే వీస్తున్నాయి.

అంతెందుకు, నన్ను చేసుకొనేటప్పుడు మీ వాళ్ళెంతగా అడ్డు పడ్డా మీరు వెనుకంజ వేశారా? అదే మంకుపట్టు. అనుకున్నది సాధించడంలో తండ్రికేం తీసిపోవడం లేదు మీ అబ్బాయి..."

భార్య సులోచన కూడా కొడుకునే వెనకేసుకొచ్చింది.

ప్రణీత కులాంతరమైనా డబ్బున్నదైతే పట్టింపు ఉండేది కాదు.

'ఈ సొసైటీలో డబ్బు లేకుంటే విలువే లేదు! అర్ధాంగిగా ఉండీ తన బాధ అర్థం చేసుకోదే...'

జగదీష్ మనోగతం అవగతమైన దానిలా— "మీ డబ్బు యావ గంగలో పడా! మనకున్న ఆస్తి పాస్తులే రెండు మూడు తరాలకు సరిపడ ఉన్నా, ఇంకా ఇంకా సంపాదించి ఏం చేస్తారు? ఏదైనా ఎక్కువైతే వెక్కసమే! ఆశకైనా ఓ అంతుండాలి! నేను మాత్రం అబ్బాయినే సమర్థిస్తున్నాను. వాడి పెళ్ళి దగ్గరుండి జరిపిస్తాను. అంతే!"

ఇటు భార్య, అటు కొడుకు ఒక పడవలో ఉంటే, తనెందుకు వేరే పడవ ఎంచుకుంటాడు? ఆ ఇద్దరి సుఖం కోసమే తనింత సంపాదించింది. డబ్బులోనే సుఖం లేదు! కుటుంబ సభ్యులంతా ఏ విషయాన్నైనా ఏకత్రాటిపై నడిపితేనే సుఖశాంతులు!

ఓ నిర్ణయానికి వచ్చిన వాడిలా వెళ్తున్న భార్య చెయ్యి పట్టుకొంటూ ప్రసన్నముఖం పెట్టాడు జగదీష్. 'నేనూ నీతోనే సులో!' అన్నట్లుగా.

— వి.ఎం.ఎస్. స్వాతి.



## భారీ పబ్లిసిటీ

యువ హీరో సల్మాన్‌ఖాన్ తనకి మంచి ఇమేజ్ తెచ్చిపెట్టేందుకోసం పబ్లిసిటీ చెయ్యిస్తున్నాడు. అతని తండ్రి సలీమ్‌ఖాన్ దానికి అనుగుణంగా ప్లానింగ్ స్క్రిప్టు తయారు చేస్తుంటే 5 లక్షల రూపాయలతో ఈ పబ్లిసిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.